# ఆ క్షణం చాలదూ!

-ఎం.వి.వి.సత్యనారాయణ



ఉగాది
కథల పోటీలో
ఎంపికైన కథ

నా శిష్యుడిగా చెప్పుకునే పోలీస్ కానిస్టేబులు 576 నాకు ఉత్తరం రాశాడు. నేను డిసిపిగా రిటైరయ్యి నాలుగు సంవత్సరాలయ్యింది. అయినప్పటికీ 576 గోవిందరావు నాతో టచ్‌లో వుంటాడు. ఇప్పుడు రాసిన వుత్తరంలో తనకో మగ బిడ్డ పుట్టినట్టు రాస్తూ మా దంపతుల ఆశీస్సులు కోరాడు.

మూడేళ్ల క్రితం అతడి పెళ్లికి వరంగల్ వెళ్లి వచ్చాను.

గోవిందరావు పెళ్లిచేసుకున్న అమ్మాయిది వరంగల్‌కి దగ్గర్లో ఏదో గిరిజన గ్రామం. మా ఆవిడ జానకి కూడా పెళ్లికి రావాలని ఎంతో వుబలాట పడింది కాని ఆమె ఆరోగ్యం అంతంత మాత్రంగా వుంది. ఆ సంవత్సరమే మా సొంత యిల్లు తీవ్రవాదులు పేల్చేశారు. ఆ పేలుడు ధాటికి మా ఆవిడ తీవ్రంగా గాయపడింది. జ్వాలలు రేగి ఒళ్ళు కాలింది కూడా. కాలిన గాయాలు తగ్గడానికి చాల కాలం తీసుకుంది. మచ్చలు మానలేదు. చర్మం ఎక్కడికక్కడ చీలికలు పడి, ముడతలు పడి బిగదీసి లాగి కుట్టినట్టు మారిపోయింది.

మా యిద్దరి జీవితాలూ రిటైర్‌మెంట్‌కి వారంరోజులుందనగా పెనువిషాదంలో కూరుకుపోయాయి. జానకి యిల్లు కదిలి రావడం మానుకుంది.

"మనకో మనవడు పుట్టాడన్నమాట!" అంది జానకి.

నవ్వి, గోవిందరావుకు ఇన్‌లాండ్ కవర్ రాసి, కొరియర్‌తో బాయ్ డ్రెస్ పంపించాను. ఉత్తరం ఏమయ్యిందో తెలియదు కాని డ్రెస్ మాత్రం గోడకి కొట్టిన బంతి అయ్యింది.

ఎందుకిలా జరిగింది! ఈ నాలుగురోజుల్లోనే గోవిందరావు అడ్రస్ మారిపోయిందా, ఉద్యోగం బదిలీ అయ్యిందా!

మనస్సు బాగుండక పోలీస్ క్లబ్బుకి వెళ్లి చదరంగంలో కూర్చున్నాను. ఎస్సయ్ నాయక్ కూడా నా క్రింద పనిచేశాడు. నాతోపాటే రిటైరయ్యాడు. చదరంగం బాగా ఆడతాడు. నాకులాగానే నాయక్ కూడా తీవ్రవాదుల హిట్ లిస్ట్‌లో వుండేవాడు.

"మాడం ఎలా వున్నారు సర్!" అడిగాడు నాయక్.

నీరసంగా నవ్వాను. మా ఆవిడ ప్రస్తావన వస్తే నా మొహంలోంచి రక్తం ఇగుర్చుకు పోతుంది.

"అలాగే వుంది! బయటికి రావడానికి చాలా ఇబ్బంది పడుతోంది!"

క్రమంగా వూపిరి సలపని ఆట తమకంలో పడిపోయాం.

"నాలుగు రోజుల క్రితం గోవిందరావు ఉత్తరం రాశాడు. అక్కడికి పార్శిల్ పంపితే తిరిగొచ్చింది."

"ఎవరు సర్! ఫైవ్ ఒన్ సిక్సా సర్!" అడిగాడు నాయక్.

తలూపాను. అతడు నాయక్ దగ్గర చేశాడు. నాయక్ అతడి పెళ్ళికి వచ్చాడు కూడా.

డెలివరీ కాకుండా తిరిగొచ్చిన బాయ్ డ్రెస్ గురించి చెప్పాను.

"ట్రాన్స్‌ఫరయ్యి వుంటాడు!" అన్నాడు నాయక్.

"ఇంత అకస్మాత్తుగా రిలీవ్ అయ్యిపోతాడా!"

"రెండుసార్లు జరిగింది ఆ రకంగా ఈ రెండేళ్లలో. ఇది మూడోసారి అయ్యి వుంటుంది రిలీవయ్యితే!"

"కారణం ఏమిటై వుంటుంది!"

"సర్! మీకు గోవిందరావు తెలియపరచే వుండాలి. అతడు పెళ్లిచేసుకున్నది ఒక మాజీ తీవ్రవాదిని! ఆమె లొంగిపోయినా తీవ్రవాదులు ఆమెను వదలడం లేదు. ఎందుకంటే ఆమె ఒక కానిస్టేబులును పెళ్లిచేసుకుంది కాబట్టి" నాకు గుటక పడలేదు.

"సర్! ఆమె మీ సర్వీసులో మీకు ఎదురయ్యే వుంటుంది!"

"ఒకరా! యిద్దరా! వందల మంది! కూంబింగ్ ఆపరేషన్‌లో కూడా ఎంతోమందిని పట్టుకున్నాను."

నిట్టూర్చాడు నాయక్. అతడి నిట్టూర్పు దేనికో నాకర్థమయ్యింది. కూంబింగ్ ఆపరేషన్స్‌కి నిరసనగానే మహిళా తీవ్రవాదులు మా యిల్లు పేల్చేశారు. తీవ్రవాదులు నన్ను ఎంత వారించినప్పటికీ నా పంథా మార్చుకోలేదు. ఒక్కసారి చచ్చిపోతే ఏమిటి, వందసార్లు చచ్చిపోతే ఏమిటి? కూంబింగ్ ఆపరేషన్స్ మానేసినంత మాత్రాన తీవ్రవాదులు క్షమించి వదిలెయ్యరు.

"ఎస్ సర్! ఆమె దళ కమాండర్‌గా కూడా పనిచేసింది! పేరు-"

"హలో సర్!" నాతోపాటు పనిచేసిన హెడ్ కానిస్టేబుల్ పలకరించాడు. "కొత్త యింట్లోనే వుంటున్నారా సర్!"

"ఆహా... దివ్యంగా! మళ్లీ కట్టుకున్నదెందుకు చెప్పండి. రెండోసారి కట్టుకోవడం అంటే రెండో జన్మ ఎత్తడమే!"

"అవును సర్ మీ కష్టార్జితం దారుణంగా పేలిపోయింది. కళ్లముందే కూలిపోయింది" హెచ్‌సీ గొంతు వణికింది. నిజాయితీకి మారుపేరతడు.

మా యిల్లు మరో గంటలో పేల్చివేస్తారనగా ఆయన మా యింటికి వచ్చి వెళ్లాడు. పని విషయంలో సలహా సంప్రదింపులు తీసుకున్నాడు. ఏలేశ్వరం అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్స్ చేపట్టడమే మేము చేసిన అపరాధం.

ఎర్రక్క దళం మా యింటిని పేల్చి పారేసినట్టు ఆ దళమే పత్రికలకు లేఖ పంపింది.

"అవును." ఆయన భుజంతట్టి "మన ఫైవ్ ఒన్ సిక్స్‌కి ఈ నాలుగు రోజుల్లోనూ ట్రాన్స్‌ఫరయ్యిందా!" అడిగాను.

"ఎవరూ... గోవిందరావా! అతడి భార్య దళ సభ్యురాలిగా చేసి బయటికొచ్చి మనవాడ్నే కదూ పెళ్లిచేసుకుంది. ఆమెకు బెదిరింపు లొస్తున్నాయి. సేఫ్ జోన్‌కి మారి వుంటాడు గోవిందరావు."

"సేఫ్‌జోన్...!" ఆలోచనలో పడ్డాను. మాజీ తీవ్రవాదిని కానిస్టేబులు గోవిందరావు ఎలా పెళ్లిచేసుకున్నాడు? ఎందుకు చేసుకున్నాడు! ఇంత రిస్క్ ఎలా తీసుకున్నాడు! అసలు ఆమె అతడికి ఎలా పరిచయమయ్యింది?

నా సందేహం సదరు హెచ్‌సీ తీర్చనే తీర్చాడు.

జన జీవన స్రవంతిలో కలసిపోవడానికి గోవిందరావు పనిచేసే పోలీస్‌స్టేషన్‌లోనే ఆ మహిళా తీవ్రవాది అధికారుల సమక్షంలో లొంగిపోయింది. ఆమెకు ప్రభుత్వంవారందించిన ధన సహాయం ఎలా వినియోగించాలో అర్థంకాలేదు. ఆమెకు నాఅన్నవాళ్లెవ్వరూ లేరు. గోవిందరావుతో తన బతుకు గురించి చెప్పుకుంది.

గోవిందరావుకు మతిపోయింది. అతడూ అనాథే!

ఇంకేముంది? ఇద్దరూ కలిశారు.

పెళ్లికి వెళ్లానన్నమాటే కాని ఇదంతా నాకు తెలియదు. గోవిందరావు సంతోషంగా కనిపించాడు. తాను కోరిన పిల్లను చేసుకున్నాడన్న సంతృప్తికంటె తనకో తోడు దొరికిందన్న సంతోషమే ఎక్కువయ్యి వుండాలతడికి.

పెళ్లినించి తిరిగొచ్చాక నా భార్యతో ఆమాటే అన్నాను. 'మనవాడి అందానికి ఆ పిల్ల ఎటూ సరిపోదు. కాని ఆ పిల్ల అతడికి మంచి భార్య!'

పెళ్లి ఫొటోలు చూడాలని జానకి ఎంతో వుబలాటపడింది. ఫొటో ఆల్బం యింతవరకూ ఆమెకు చూపించడం సాధ్యపడలేదు.

వారం రోజులపాటు వరసగా క్లబ్బుకి వెళ్లాను. ఆమెకు ఎక్కువసేపు నిద్రపోవాలని వుంటోంది. అందువల్ల ఆమెకా వెసులుబాటు కల్పించాను. ఇంట్లోనే వుంటే నాకు ఏదో ఒకటి చేసిపెట్టాలని తాపత్రయ పడుతుంది.

ఏడో రోజున క్లబ్బులోంచి బయట పడుతూంటే, "సార్!" అంటూ పురుష శాల్తీ ఒకటి నా పాదాల మీద

పడిపోయింది. ఆ సాల్టీని తెరిపారచూసి పైకి లేవదీశాను.

"గోవిందరావ్!" అసంకల్పితంగానే అరచాను.

"ఎస్ సర్!" అన్నాడతడు.

★ ★ ★

గురజాడ కళాక్షేత్రంలో నేనూ జానకీ గోవిందరావూ మహలక్ష్మీ కలిసి అన్నమాచార్య కీర్తనలు వినడానికి కూర్చున్నాం. కార్యక్రమం రసవత్తరంగా సాగుతోంది. మహలక్ష్మి గుంభనంగా వుండే ఆడది. ఆమె వయస్సు గోవిందరావుతో సమానంగా వుంటుంది. కష్టతరమైన జీవితం గడిపిన దాఖలాగా మోటుగా వుంటుంది.

నా భార్యా, మహలక్ష్మీ బాగా కలిసిపోయారు.

"రేపోసారి ఇంటికి తీసుకురావయ్యా గోవిందు!" అంది జానకి.

"వచ్చే ఆదివారం వస్తాం ఆంటీ!"అంది మహలక్ష్మి.

ఆ ఆదివారం రానేవచ్చింది. గోవిందరావు కుటుంబం సాయంత్రంవేళ టీకి వచ్చింది. మా యిల్లు చాలకాలం తర్వాత కళకళలాడింది.

మా యింటికి కొడుకూ, కోడలూ వచ్చినంతగా పరమానందమై పోయింది. మాకు పిల్లలు కలగని లోటు ఈ రకంగా తీరిందేమో అనిపించింది.

"ఆంటీ! ఏమయ్యింది!"అంది మహలక్ష్మి, మా ఆవిడ ఒళ్ళుచూసి.

జానకి మొహంలోకి మలినమైన జ్ఞాపకం తెర పొడుచుకొచ్చింది.

"గుర్తుచేశావా!" అంది జానకి.

"సారీ ఆంటీ! కష్టమైతే చెప్పవద్దు."

"ఫరవాలేదు. బాధ పంచుకుంటే తగ్గుతుందంటారు. ఆయన డి.సి.పి.గా వున్నప్పుడు తీవ్రవాదులు మా యిల్లు పేల్చేశారు. రిటైర్‌మెంట్‌కి ముందు. కూంబింగ్ ఆపరేషన్స్‌లో పాల్గొనకూడదని అంతకుముందు ఎన్నోసార్లు హెచ్చరించారు."

మహలక్ష్మి ఆసక్తిగా ముందుకు వంగింది.

"పేల్చిన యిల్లు ఎక్కడుంది!" అడిగింది కాస్సేపటికి.

"విశాలాక్షినగర్‌లో మామిడితోపు యివతల. ఆకుపచ్చ రంగు డాబా యిల్లు. ఆయన కష్టార్జితమంతా బుగ్గిపాలయ్యిపోయింది. డ్యూటీ సక్రమంగా నిర్వహించినందుకు మా జీవితాలు బలయ్యిపోయాయి."

"విశాలాక్షినగర్..." గుణించుకుంది మహలక్ష్మి.

"వాళ్ళు నీకు తెలిసే వుంటారు!" అడిగింది జానకి.

మహలక్ష్మి అవుననలేదు. కాదననూ లేదు... మలినమైన జ్ఞాపకం తెర జానకి మొహంలోంచి ఆమె మొహంలోకి మారింది.

మరుచటి ఆదివారం జానకీ నేనూ కలసి గోవిందరావు తీసుకున్న అద్దె యింటికి వెళ్ళాం. పిల్లవాడి డ్రెస్ పాకెట్ మహలక్ష్మికి అందించాను.

మహలక్ష్మి కదిలిపోయింది. కన్నీళ్ళు తిరిగాయి.

"తల్లీ తండ్రీ లేని మా యిద్దరికీ మీరే తల్లిదండ్రులు!" అంది మహలక్ష్మి, మా యిద్దరి పాదాలూ స్పృశించి.

మాకు శరీరాలు జలదరించాయి. ఆమెను పైకి లేవనెత్తాం. గోవింద రావయితే సరేసరి! కళ్లు తుడుచుకుంటున్నాడు.

★ ★ ★

సుమారు ఒక ఏడాది గడిచి వుంటుంది. ఈమధ్యకాలంలో గోవిందరావు తన కుటుంబం మా అవుట్‌హావుస్‌కి మార్చాడు. నాకూ, మా ఆవిడకీ బోలెడంత కాలక్షేపంగా వుంది.

గోవిందరావు కొడుకు మా యిద్దరికీ బాగా చేరికయ్యాడు. మహలక్ష్మి మా ఆవిడకి చేదోడు వాదోడుగా వుంటోంది... వేళకింత మంచి ఆహారం అందుతోంది. జానకి ఆరోగ్యం బాగుపడింది. ఎప్పటికప్పుడు మహలక్ష్మి చేసే తైలమర్దనాలు జానకి శరీరానికి చాలవరకూ మేలు కలిగిస్తున్నాయి. ఆమె మొహంలోకి కళాకాంతీ తిరిగొచ్చాయి. ఇంటి పనీ, తోట పనీ, మార్కెట్టు పనులూ ఆడవాళ్ళే చూసుకుంటున్నారు.

మా యిద్దరి జీవితాల్లో ఇంతటి రిలీఫ్ రాగలదని కలలోకూడా వూహించలేదు. రోజులు మరింత ఆనందంగా గడుస్తాయనుకునేటప్పటికి మహలక్ష్మి బాంబు పేల్చింది.

"నన్ను ఎవరో వెంటాడుతున్నారు నాన్నగారూ!" అంది మహలక్ష్మి.

"వెంటాడుతున్నారా? ఎవరు! ఎలా వుంటారు! ఎందుకు వెంటాడతారు!" అడిగాను.

"ఒకప్పటి నా సహచరులనుకుంటాను... నన్ను ఇన్‌ఫార్మర్‌గా భావించి వుంటారు. నన్ను వదిలిపెట్టరు అదే నిజమైతే!"

"అదేమిటి! సేఫ్‌జోన్‌కి అందుకే కదూ నువు మారింది! అతడికి ట్రాన్స్‌ఫర్ కూడా అందుకే కదూ యిచ్చారు."

"మీకో సంగతి ఎలా తెలుసు నాన్నగారూ!"

"పిచ్చి పిల్లా! పిల్లవాడి డ్రెస్సు మీకందలేదంటే నేనూరుకుంటానా!"

ఎందువల్లనో ఆమె మొహం మ్లానమయ్యింది. క్షణాల్లో ముఖ కవళికలు మార్చుకుని, "ఇంకా ఏం తెలుసుకున్నారు!" అంది.

"మీ ఇద్దరికీ ఎవ్వరూ లేరని! అంతే! అది సరే, ఇప్పుడు మనం చెయ్యవలసిందేమిటి?"

"నాక్కూడా ఏం తోచడంలేదండి! వాళ్లకి సందేహం కలిగితే ఏ పరిస్థితిలోనూ నివృత్తి కాదు!"

"పోలీస్ రక్షణ కోరదామా!"

ఆమె ఆలోచనలో పడింది. గోవిందరావు కాంప్ వెళ్లాడు. కాబట్టి ఆమె సొంతంగా నిర్ణయం తీసుకోలేకపోతోంది.

★ ★ ★

ఎందువల్లో నిద్రపట్టడంలేదు. ప్రక్కనున్న బెడ్ మీద జానకి నిశ్చింతగా నిద్రపోతోంది. రోజూ నిద్రమాత్ర వేసుకుంటుంది జానకి. నేను మామూలుగానే నిద్రపోతాను.

ఎందువల్ల మెలకువగా వున్నానో అర్థంకాలేదు. లేచి బెడ్ దిగి పిల్లి అడుగులతో కిటికీ దగ్గరికి చేరుకున్నాను.

వెన్నెల తోటలో పల్చగా పడుతోంది. ఇంటి ఆవరణలో చిన్న పూల తోటా, ఆ ప్రక్కన అవుట్ హవుసూ, ప్రహరీకీ అవుట్ హవుస్‌కీ మధ్య కూరగాయల మడీ-

వెన్నెల తోట అంతటా వెన్నెల లాగా లేదు. మధ్య మధ్య చిన్న చిన్న మచ్చల్లాగా వుంది వెన్నెల. పరీక్షించి చూడబోతే ఆ మచ్చలు కదులుతున్నాయి.

మరింత పరీక్షగా చూశాను. మా యింటికీ అవుట్ హవుస్‌కీ చుట్టూ తీగ రన్ చేస్తున్నారు. అర్థమయ్యింది నాకు. అప్పటికే మా యింటికీ అవుట్ హవుస్‌కీ డెటొనేటర్లు అమర్చారన్నమాట!

బృహత్తర స్థాయిలో మా యిల్లు మరోసారి నేలమట్టం కాబోతోంది. ఈసారి మా రెండు ప్రాణాలతోబాటు మహలక్ష్మీ ఆమె కొడుకు కూడా.

ఇప్పుడేం చెయ్యాలి? మహలక్ష్మి మీది కోపం యిారకంగా తీర్చుకుంటున్నారు ఆమె విరోధులు. నేనేం చెయ్యాలో ఆలోచించుకునేలోగా అవుట్ హవుస్ తలుపు తెరచుకుంది. గదిలో వెలుగు. గుమ్మంలో వెలుగుకు అడ్డంగా స్త్రీ ఆకారం.



"ఫరవాలేదు. బాధ పంచుకుంటే తగ్గుతుందంటారు. ఆయన డి.సి.పి.గా వున్నప్పుడు తీవ్రవాదులు మా యిల్లు పేల్చేశారు. రిటైర్‌మెంట్‌కి ముందు. కూంబింగ్ ఆపరేషన్స్‌లో పాల్గొనకూడదని అంతకుముందు ఎన్నోసార్లు హెచ్చరించారు."

తోటలో నీడలు ఎక్కడివక్కడే నిలబడిపోయాయి.

ఆమె విసురుగా కిందికొచ్చింది.

నరాలు తెగే వుత్కంఠ. ఆగంతకులు తర్వాత ఏం స్టెప్ వేస్తారు? వాళ్ళు ఎదురుచూడని ఈ పరిణామం ఏ ధ్వంస రచనను వేగిర పరుస్తుంది! వాళ్ళు మహలక్ష్మిని కాలుస్తారా! లేక తమ వెంట తీసుకుపోతారా! మానవ ప్రాణాలు తప్పించి ఇల్లు నేలమట్టం చేస్తారు!

నా వృద్ధాప్య దశలో తిరిగి మృత్యువును కొనితెచ్చుకున్నాను. నా బుద్ధి మారదా! అప్పట్లో మితిమీరిన వుత్సాహంతో కూంబింగ్ కార్యక్రమాలు నిర్వహించాను- దువ్వెనతో తల దువ్వుకున్నంత సులువుగా. ఇప్పుడు మాజీ తీవ్రవాదిని పక్కలో బాంబులాగా మూటకట్టుకున్నాను. నావల్ల నా భార్యకొచ్చిన కష్టాలు అన్నీ యిన్నీ కావు. ఈ ఇల్లు కూడా కుప్పకూలిపోతే ఇక ఎక్కడ గడపాలి!

"అన్నలారా!" పిల్చింది మహలక్ష్మి.

వాళ్ళ దళ నాయకుడు ముందుకొచ్చాడు.

"నన్ను కాల్చండి! నేనేకదూ శత్రువునని మీ అనుమానం!"

దళ నాయకుడు అదో రకంగా నవ్వి "నిన్నూ, పోలీసోడ్ని కూడా వదిలిపెట్టం." అన్నాడు.

"డిసిపిగారేం పాపం చేశారు!" ఆమె కంఠం ఖంగుమంది.

"పోలీసుల కపట నాటకం మాకు తెలియనిది కాదు!"

"అదే." ఎలాగో చెప్పండి- కపట నాటకమేమిటో-"

ఇంటి వెనకనించి సాయుధులిద్దరు ఆమెకు ఆయుధాలు గురిపెట్టారు.

"అన్నలారా! నేనే పాపం ఎరగను!"

ఇంట్లోంచి తోటలోకి పరుగెత్తాను. పరిస్థితి విషమిస్తోంది.

"అన్నలారా! తొందర పడకండి. మీ ప్రయత్నం విరమించుకోండి. నేను ఎర్రక్కగా దళ కమాండర్ హోదాలో ఒకసారి ఈ నాన్నగారి యిల్లు పేల్చిపారేశాను. ఇప్పుడు ఆయనే నాకు ఆశ్రయం యిచ్చారన్న నెపంతో రెండోసారి కూడా ఆయన యిల్లు నేలమట్టం చేస్తారు... ఆలోచించండి! మీకిది ధర్మమా!"

నాకు కళ్లు పచ్చబడ్డాయి.

మహలక్ష్మి మాట్లాడేది వినేకొద్దీ నాకు మతిపోతోంది.

మహలక్ష్మి పూర్వం ఎర్రక్కగా ఒక తీవ్రవాదా! నా యిల్లు పేల్చింది మహలక్ష్మేనా! నిజంగానే ఈ బండమ్మాయి అంత చాకచక్యంగా యాక్షన్ టీం నడిపిందా! నమ్మలేకపోతున్నాను. ముందుకు నడిచాను- ట్రాన్స్‌లో లాగా-

అదే సమయంలో మహలక్ష్మి నన్ను చూసింది.

తలదించుకుంది.

ఎందుకలా తల దించుకుందో నాకర్థంకాదా!

"షూట్ హర్!"

ఏం జరిగిందో తెలియదు. ముందుకు దూకి ఆమెకు రక్షా కవచంగా నన్ను నేను చుట్టేసుకున్నాను.

అంతా క్షణాల్లో తీసుకున్న నిర్ణయం.

ఎ.కె.47 గర్జన వినిపించింది. అంతే!

★